క్లుప్తంగా

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నాగిరెడ్డి



నియామకపత్రం అందజేస్తున్న సీతారాంరెడ్డి

మిర్యాలగూడ టౌన్: బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా మిర్యాలగూడ మండలం శ్రీనివాస్‌నగర్‌కు చెందిన సజ్జల నాగిరెడ్డి నియామకమయ్యారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయనకు కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సీతారాంరెడ్డి, మండల అధ్యక్షుడు పులి విద్యాసాగర్ గురువారం మిర్యాలగూడలోని పార్టీ కార్యాలయంలో నియామకపత్రం అందజేశారు.

పద్మశాలీల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పద్మశాలీ సంఘం నాయకులు

మిర్యాలగూడ: పద్మశాలీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పద్మశాలీ సంఘం స్టీరింగ్ కమిటీ కన్వీనర్ బావండ్ల పాండు, కోకన్వీనర్ రాపోలు వెంకటేశ్వర్లు కోరారు. గురువారం మిర్యాలగూడలోని పద్మశాలీ సంఘం భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కండేయస్వామి ఆలయానికి సుమారు 20గుంటల ప్రభుత్వ భూమిని గుర్తించి కేటాయించాలన్నారు. ఇందుకోసం త్వరలోనే ఎమ్మెల్యే భాస్కర్‌రావును కలిసి విన్నవించనున్నట్లు తెలిపారు. సమావేశంలో చెరుపల్లి చంద్రమౌళి, గంజి యాదగిరి, మిర్యాల చంద్రమౌళి, నామిని సోమయ్య, జెల్లి భిక్షం, రామ్‌ప్రసాద్, చిలుకూరి బాలు, కేమా వెంకటేశం, చిలుకూరి శ్యాం, రాంబాబు, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

ముత్తిరెడ్డికుంటలో మహా అన్నదానం

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని 19వ వార్డు ముత్తిరెడ్డికుంటలో గురువారం శ్రీ సంతోషిమాత అమ్మవారి జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. అనంతరం మాతాజీ అన్నపూర్ణదేవి, స్థానిక మార్కెట్ కమిటీ డైరెక్టర్ నవాబు మహాఅన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో చామల సైదులు- దుర్గ, వాసు- మాధవి, రామ్మూర్తి- సీత, చంద్రయ్య దంపతులతోపాటు వెంకట్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, కొండారెడ్డి, సంపత్, చంటి, శ్రీనివాస్, వెంకన్న తదితరులున్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కొండమల్లేపల్లి: మండలంలోని చిన్నఅడిశర్లపల్లిలో గురువారం విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన రావుల శంకరయ్య తన పొలంలో రెండు ఎద్దులు, రెండు గేదెలను మేపుతుండగా పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగలడంతో ఓ ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ రూ.75వేలు ఉంటుందని రైతు పేర్కొన్నాడు.


బంగారికుంటతండాలో వైద్యపరీక్షలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అడవిదేవులపల్లి: మండలంలోని బంగారికుంట తండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులకు గురువారం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన వైద్యులు కిడ్నీ సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించారు. వారి నుంచి శాంపిల్స్ సేకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుర్ర సుజాత, డాక్టర్ ఉపేందర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రవికుమార్, ఉప సర్పంచ్ కుర్ర శ్రీను, హుస్సేన్, శ్రావణి, ప్రీతి, స్వప్న, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుమార్‌గౌడ్‌కు డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న కుమార్‌గౌడ్

నకిరేకల్ : మండలంలోని కడపర్తి గ్రామానికి చెందిన యర్కల కుమార్‌గౌడ్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి వృక్షశాస్త్రంలో డాక్టరేట్ అందుకున్నారు. ప్రస్తుతం కుమార్‌గౌడ్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ఒప్పంద అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డాక్టరేట్‌ను విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ సీతారామారావు, రిజిస్ట్రార్ ఏవీఎన్, అకాడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ గంటా చక్రపాణి చేతుల మీదుగా అందుకున్నారు.

ఆత్మీయ బంధం.. రక్షాబంధన్

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ సందర్భంగా గురువారం పల్లెలు, పట్టణాల్లో పండుగ వాతావరణం నెలకొంది. సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. రాఖీల కొనుగోలుదారులతో రహదారులు కిక్కిరిసిపోయాయి. ఆయా ఆర్టీసీ బస్టాండ్‌లు సైతం ఉదయం 5గంటల నుంచే ప్రయాణికులతో కిటకిటలాడాయి. – సాక్షి నెట్‌వర్క్



అడవిదేవులపల్లి: కస్తూర్బా గాంధీ పాఠశాలలో రాఖీ కడుతున్న విద్యార్థినులు



దేవరకొండలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌కు రాఖీ కడుతున్న పీఏపల్లి వైస్ ఎంపీపీ అర్వపల్లి సరిత



మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ భార్గవ్‌కు రాఖీ కడుతున్న ఆయన సోదరి పుష్పలత



మిర్యాలగూడ: ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్యోగస్తులకు రాఖీ కడుతున్న ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి



మిర్యాలగూడ మండలం అవంతీపురం బధిరుల పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు



హాలియాలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు కుందూరు జైవీర్‌రెడ్డికి రాఖీ కడుతున్న చిన్నారులు



బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్‌కు రాఖీ కడుతున్న ఆయన సోదరి



మిర్యాలగూడలోని మేరెడ్డి రామచంద్రారెడ్డి స్మారక గ్రంథాలయంలో రాఖీ వేడుకల్లో యోగా సభ్యులు



మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



కొండమల్లేపల్లిలో రాఖీలు కొనుగోలు చేస్తున్న జనాలు

కుల వృత్తులను ఆదుకునేందుకు కృషి

- ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

దేవరకొండ: కుల వృత్తులను ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం దేవరకొండ పట్టణంలోని 17వ వార్డులో రూ.5లక్షలతో నిర్మించనున్న పూసల సంఘం భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ సంచార జాతులు ఆర్థికంగా ఎదిగేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏరాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో సంక్షేమ కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వైస్ చైర్మన్ రహత్‌అలీ, జెడ్పీటీసీ బాలునాయక్, చిత్రం ప్రదీప్, సైదులు, రయిస్, చెన్నయ్య, పురుషోత్తం, రఘు, శ్రీను, గోపాల్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సరస్వతమ్మకు నివాళి

డిండి: మండల పరిధిలోని కామేపల్లి గ్రామానికి చెందిన మాధవరం సరస్వతమ్మ ఇటీవల మృతి చెందింది. గురువారం గ్రామంలో నిర్వహించిన దశదినకర్మ కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్ పాల్గొని, ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఆర్‌వీఆర్, పీఏసీఎస్ చైర్మన్ నాగార్జున్‌రెడ్డి, జనార్దన్‌రావు, గోపాల్‌రావు, కొండల్‌రావు తదితరులున్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరికలు

- జెడ్పీ వైస్‌చైర్మన్ ఇరిగి పెద్దులు



బీఆర్ఎస్‌లో చేరిన ఇతర పార్టీల కార్యకర్తలు

హాలియా: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు జెడ్పీ వైస్‌చైర్మన్ ఇరిగి పెద్దులు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సాధం సంపత్‌కుమార్ అన్నారు. హాలియా మున్సిపాలిటీ పరిధిలోని 7వ, 8వ వార్డులకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గురువారం అనుముల గ్రామంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ ప్రసాద్ నాయక్, పట్టణ కార్యదర్శి దోరెపల్లి వెంకటేశ్వర్లు, మైనార్టీ అధ్యక్షుడు బాబుద్దీన్, కోఆప్షన్ మెంబర్ రావుల లింగయ్య, నాయకులు మాతంగి కాశయ్య, జింకల ప్రసాద్, పిల్లి నాగరాజు, బొడ్డుపల్లి ఈదయ్య, జూపల్లి కృష్ణ, మురళి, చల్మాన్ రాజు, రాంబాబు, మధుసూదన్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న శంకర్

పెద్దవూర: మండలంలోని తుంగతుర్తి గ్రామ రెవెన్యూ శివారులో ఉన్న దూదివానికుంట చెరువును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని తండాకు చెందిన రమావత్ శంకర్ కోరారు. ఈమేరకు గురువారం నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఉప కార్యనిర్వాహక ఇంజనీర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మిషన్ కాకతీయలో భాగంగా దూదివానికుంట చెరువుకు 600 మీటర్ల పొడవు కట్ట పోశారని పేర్కొన్నారు. తండాకు చెందిన పలువురు చెరువు కట్టలో సగభాగం చదును చేసి, తమ వ్యవసాయ పొలాల్లోకి మార్చుకుని, అందులో బోర్లు వేశారని ఆరోపించారు. దీనిపై విచారణ చేసి ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో తండావాసులు తులసీరాం, లోకేష్‌నాయక్, లాలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

త్రిపురారం: మండలంలోని మర్రిగూడెం గ్రామానికి చెందిన సైదాచారి బ్రెయిన్ ట్యూమర్‌తో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం తెలుసుకున్న బుసిరెడ్డి పాండురంగారెడ్డి బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు గురువారం ఆర్థికసాయం అందించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

- ఆర్డీఓ శ్రీరాములు

చింతపల్లి: సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ శ్రీరాములు కోరారు. గురువారం చింతపల్లి మండల కేంద్రంలో లక్కీ డ్రా ద్వారా డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో 25 డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రభుత్వం నిర్మించగా 53 మంది అర్హులుగా ఎంపిక చేశామని, ఎలాంటి అవకతవకలు లేకుండా లబ్ధిదారుల సమక్షంలో లక్కీ డ్రా తీసినట్లు పేర్కొన్నారు.

ఇళ్ల పంపిణీపై ఆందోళన

అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించాలని కోరుతూ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. చింతపల్లి మండల కేంద్రంలో చేపట్టిన డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ అధికార బీఆర్ఎస్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు ఆరోపించారు. అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు అందకుండా అధికార పార్టీకి చెందిన వారి పేర్లను లక్కీ డ్రాలో నమోదు చేయించారని తెలిపారు. అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో భారీ పోలీసు బందోబస్తుతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ శంషొద్దీన్, ఎంపీడీఓ రాజు, సర్పంచ్ ముచ్చర్ల యాదగిరి, ఎంపీటీసీ ఎల్లంకి వరలక్ష్మి, నల్లవెల్లి సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పట్టణంగా నీలగిరి మున్సిపాలిటీ

- మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ మందడి సైదిరెడ్డి

నల్లగొండ టూటౌన్ : రాష్ట్రంలోనే నీలగిరి మున్సిపాలిటీ ఆదర్శ పట్టణంగా రూపుదిద్దుకుంటుందని మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ పాలకవర్గ సమావేశం చైర్మన్ మందడి సైదిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో చేపడుతున్న రహదారుల విస్తరణ, సుందరీకరణ పనులు, ఐటీ హబ్, మెడికల్ నిర్మాణాలతో పట్టణ రూపురేఖలు పూర్తిగా మారిపోయి హైదరాబాద్ నగరాన్ని తలపిస్తుందన్నారు. పట్టణంలో చేపడుతున్న అన్ని రకాల అభివృద్ధి పనులు చివరి దశకు చేరుకున్నాయని, సెప్టెంబర్ రెండో వారంలో సీఎం కేసీఆర్‌తో ఐటీ హబ్, ఇతర అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఐటీ హబ్‌లో ఉద్యోగాల కోసం 8500 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. అనంతరం కోఆప్షన్ సభ్యుడు కొందూరు సత్యనారాయణ మాట్లాడుతూ.. బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా ఉన్న శ్మశానవాటికలో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో దహన సంస్కారాలు చేసే సమయంలో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్ మాట్లాడుతూ.. వార్డుల అభివృద్ధికి నిధులు ఇస్తామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఇప్పటికీ నిధులు రాలేదన్నారు. 36వ వార్డులో నీటి పైప్‌లైన్ వేయడంలో ఎందుకు జాప్యం జరుగుతుందని ప్రశ్నించారు. గృహలక్ష్మి, దళితబంధు, బీసీ బంధును పార్టీలకతీతంగా పేదలకు ఇవ్వాలని, బీఆర్ఎస్ కార్యకర్తలకు మాత్రమే ఇవ్వడం సరికాదన్నారు. కౌన్సిలర్ బొడ్డుపల్లి లక్ష్మి మాట్లాడుతూ.. వార్డుల అభివృద్ధికి కెటాయించిన నిధులకు వెంటనే టెండర్లు పిలవాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్ ఖయ్యుంబేగ్ మాట్లాడుతూ.. దళితబంధు, బీసీబంధు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వారికే వస్తున్నాయని, బీఆర్ఎస్‌పై అపనిందలు సరైందికాదన్నారు. సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు కమిషనర్ రమణాచారి సమాధానాలు చెప్పారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రమణాచారి, అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్‌ముసాబ్ అహ్మద్, ఏసీపీ నాగిరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గాదరి కిశోర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయం

శాలిగౌరారం : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గంలో ప్రస్తుత ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మూడో సారి గెలుపొంది హ్యాట్రిక్ సాధించడం ఖాయమని మాదిగ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకంటి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని ఇటుకులపహాడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

గృహ‘లక్ష్మీ కటాక్షం’ ఎవరికో..?

- దరఖాస్తుల పరిశీలన పూర్తి
- ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్న కార్యదర్శులు
- జోరందుకున్న పైరవీలు



పెద్దవూర ఎంపీడీఓ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్న ఆపరేటర్లు

పెద్దవూర: గృహలక్ష్మి పథకానికి పెద్దవూర మండల వ్యాప్తంగా భారీగా దరఖాస్తులు వచ్చాయి. గ్రామాలు, తండాల్లో వచ్చిన దరఖాస్తులపై సర్వే కూడా పూర్తవ్వడంతో గృహ ×లక్ష్మీ కటాక్షం₹ ఎవరిని వరిస్తుందోనని అర్జీదారుల ఎదురుచూస్తున్నారు. మొదటి దశలో నియోజకవర్గానికి మూడు వేల ఇళ్లు మంజూరైన విషయం విధితమే. తహసీల్దార్ కార్యాలయంలో ఆగస్టు 8, 9, 10 తేదీల్లో గృహలక్ష్మి దరఖాస్తులను స్వీకరించారు. ఈమేరకు మండలంలో 3022 దరఖాస్తులు వచ్చాయి. మండలంలో మొత్తం 26 గ్రామ పంచాయతీలు ఉండగా అధికారులు ఏడు బృందాలుగా వెళ్లి క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించారు. గ్రామాల వారీగా అర్హుల వివరాలు, దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎంపీడీఓ కార్యాలయానికి పంపించారు. ఈ వివరాలను గత ఐదు రోజులుగా గ్రామాల వారీగా పంచాయతీ కార్యదర్శులు పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నారు.

మారుతున్న నిబంధనలతో అధికారుల పరేషాన్..

అర్హులను గుర్తించే క్రమంలో ప్రతీసారి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిబంధనలు మారుతున్నాయి. మొదట ఇందిరమ్మ ఇళ్లు, స్లాబ్ ఇళ్లు ఉంటే అనర్హులుగా గుర్తించాలని, తర్వాత అర్హులుగా గుర్తించాలని నిబంధనలు వచ్చాయి. ఈ నెల 21న 2014 ఏప్రిల్ వరకు ఇంటిపన్ను డిమాండ్ రిజిస్టర్‌లో పేర్లు ఉంటేనే గుర్తించాలని, ఆ తర్వాత ఇళ్ల స్థలాలు క్రయ, విక్రయాలు చేసిన వారిని అనర్హులుగా గుర్తించాలని నిబంధనలు విధించారు. వీటన్నింటిని మార్పు చేయగా ప్రస్తుత నిబంధనలు ఇలా ఉన్నాయి. పూర్తిస్థాయి ఇందిరమ్మ ఇళ్లు ఉన్న వారిని పక్కనపెట్టి, రెండో దఫాలో అవకాశం కల్పిస్తూ అర్హులుగా గుర్తించాలని సూచనలు వచ్చాయి. దీంతో అధికారులు, కార్యదర్శులు సతమతమవుతున్నారు. మొదటగా ఉన్న నిబంధనల ప్రకారం మండలవ్యాప్తంగా 550 మంది అర్హులుగా అధికారులు లెక్కతేల్చి, 2472 దరఖాస్తులను అనర్హత కలవిగా గుర్తించారు. తర్వాత నిబంధనలలో కొన్నింటిని సడలించడంతో రీసర్వే చేపట్టి 2,655 మందిని అర్హులుగా గుర్తించారు. మండలంలో అత్యధికంగా పెద్దవూర జీపీ పరిధిలో 279 దరఖాస్తులు రాగా అందులో 119 అర్హులుగా, పర్వేదులలో 177 రాగా 155 అర్హులుగా గుర్తించారు. అత్యల్పంగా పిన్నవూర గ్రామ పంచాయతీలో 15 దరఖాస్తులు రాగా అందులో ఆరుగురిని అర్హులుగా గుర్తించారు. ఇప్పటివరకు 2655 దరఖాస్తుల్లో 523 ఆన్‌లైన్ చేశారు. ఇంకా 2131 దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాల్సి ఉంది.

ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహలక్ష్మి పథకంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న అర్జీదారులలో అర్హులైన వారిని గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. పథకంలో నిబంధనలు మార్చటంతో కొంత అయోమయం ఉంది. మొదట 550 మందినే అర్హులుగా గుర్తించారు. ఆ తర్వాత నిబంధనలలో మార్పులు రావడంతో రీ సర్వే చేసి 2655 దరఖాస్తులు అర్హత కలవిగా గుర్తించాం. వీటన్నింటిని పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్‌లో నమోదు చేసే పనిలో ఉన్నారు. ఇప్పటివరకు 523 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశాం.

– రమేష్ దీన్‌దయాళ్, ఎంపీడీఓ, పెద్దవూర

ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు

గృహలక్ష్మి పథకంలో తమకు అవకాశం కల్పించాలని కోరుతూ పలువురు దరఖాస్తుదారులు ప్రజాప్రతినిధులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మంజూరైన ఇళ్ల సంఖ్య తక్కువగా ఉండటం, అర్జీదారులు ఎక్కువ మంది ఉండటంతో సమాధానం చెప్పలేక వారు తలలు పట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, నాయకులు తమ బంధువులు, స్నేహితుల పేర్లు జాబితాలో ఉండేలా పావులు కదుపుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఘనంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

అడవిదేవులపల్లి: మండల కేంద్రంలో అభయాంజనేయస్వామి విగ్రహాన్ని గురువారం వైభవంగా ప్రతిష్ఠించారు. యడవల్లి రఘురామయ్యశర్మ, యడవల్లి కృష్ణశర్మలు ప్రత్యేక పూజలు చేశారు. మహోత్సవానికి పరిసరాల ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.



అడవిదేవులపల్లిలో అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న అర్చకులు

‘నోముల భగత్‌కే బీసీ కులాల మద్దతు’



సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్, బీసీ కుల సంఘాల నాయకులు

త్రిపురారం: నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ యాదవ్‌కే బీసీ కులాల మద్దతు ఉంటుందని, ఐక్యంగా ఉండి గెలిపించుకుంటామని త్రిపురారం మండల బీసీ కుల సంఘాల నాయకులు తెలిపారు. గురువారం త్రిపురారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీసీ కుల సంఘాల మండల నాయకులు, బీఆర్ఎస్ పార్టీ బీసీ అనుబంధ సంఘాల సభ్యులు ఎమ్మెల్యే అభ్యర్థి నోముల భగత్‌కు మద్దతుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగత్‌కు టికెట్ కేటాయించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గత పాలకుల 35 సంవత్సరాల హయాంలో అభివృద్ధి జరగలేదని, బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో గ్రామాభివృద్ధి సాధ్యమైందన్నారు. బీసీలమంతా కలిసికట్టుగా మరోసారి ఎమ్మెల్యేగా నోముల భగత్‌ను గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బహునూతుల నరేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీటీసీ అంబటి రాము, పావనగుండల వెంకటాచారి, సాగర్ నియోజకవర్గ యాదవ యువజన సంఘం అధ్యక్షుడు జానపాటి సతీష్ యాదవ్, గుండెబోయిన వెంకటేశ్వర్లు, మహిళ అధ్యక్షురాలు మాధా ధనలక్ష్మి, ఇండ్ల నాగరాజు, రామచంద్రయ్య, నగిరి శ్రీనివాస్, గుండెబోయిన రామయ్య, నాగయ్య, చిన్న మట్టయ్య, చిన్న సాయిలు, రామలింగం, సర్పంచ్‌లు, బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.